కథానిక:

# మా బామ్మ

★

శ్రీమతి నందివాడ పుతలీబాయి

నా చిన్నప్పటి చిలిపిచేష్టలు తల్చుకుంటే మళ్ళీ అప్పటిఅంత సంతోషాన్ని అనుభవిస్తాను. నిజంగా అవే సుఖంగా గడిపిన రోజులు. అందుకనే అంటారు, ఎప్పుడూ జరిగిన రోజులే మంచివని! చీకూ చింతా లేకుండా హాయిగా తిరిగానప్పుడు.

ఎంత అల్లరి చేసేవాడిని! అందుకనే మా అబ్బాయి ఏమైనా కొంటెపనులు చేస్తే సాధారణంగా కేకలు వెయ్యను. మావాడి అల్లరి నేను చేసిన అల్లరిలో ఎన్నో వంతు! అసలు పల్లెటూరి పిల్లలకి తెలిసిన అల్లరులు పట్నవాసపు కుర్రకుంకల కేం తెలుసు?

మా ఊళ్ళో నా చెయ్యి లేకుండా ఏ అల్లరిపనీ జరగలేదు. ఆటలు చాలా బాగా ఆడేవాడిని. గమ్మత్తులు చేయడంలో ఫస్టు నేను. మా ఊరి పిల్లలందరం ఒక జట్టుగా ఉండేవాళ్లం. ఆ జట్టుకి నాయకుణ్ణి నేను. ఒకసారి అట్లతద్దికి మేం చేసిన అల్లరి ఎప్పటికీ మరచిపోలేను.

అట్లతద్దినాడు తెల్లవారుఝామున నేనూ లేస్తానన్నాను. మా పిన్ని 'ఆడపిల్లలా నీ వెందు' కని కసిరింది. నాకు మా పిన్నిమీద భలే కోపం వచ్చింది. లోపల తిట్టుకున్నాను పైకే అంటే కొట్తుందని భయం మరి! ఏడుపు మొహంతో మా బామ్మపక్కన చతికిలబడ్డాను. ఆవిడకి జాలేసింది పాపం. 'అదేమిటే బొడ్డూడని వెధవకూడా మగవాడేనా! ఇంతట్లోకి ఆడపిల్లయిపోడు. ఏదో సరదాపడ్తున్నాడు పసివెధవ! తెలవారుఝామున లేపు పాపం!' అంది.

"ఈయనగారికోసం నేను తెల్లవారుఝామునే లేవలే"నంది మా పిన్ని బొమలు ముడుస్తూ. అందుకనే అంటారు తల్లిలేని బిడ్డ లోకానికంతకీ బరువని. "చిన్నబాబు అడుగుతే పంప నంటావా! ఏదో పాపం చేసుకున్నావుకనకనే తల్లి పోయిందిరా నాయనా. ఏడవకురా వెర్రివెధవ! నేను లేపుతాలే. నే నున్నన్నాళ్లూ నీకు తక్కువ చేస్తా ననుకున్నావా బాబూ!"

అని గుడ్లనీరు క్రుక్కుకుంది. ఇంట్లో ముసిలివాళ్లు ఉండడం పిల్లల కెంతో లాభ మనుకోండి!

తెల్లవారుఝామున ౪ గంటలకి మా బామ్మ నన్ను లేపి గోంగూరపచ్చడి, ఉల్లిపాయపులుసు పెరుగుతో అన్నం పెట్టింది. వీధిగుమ్మందాకా వచ్చి నేను వెళ్ళిపోతూంటే చెప్పింది. 'అల్లరిపనులు చేయకు. ఆ వెధవ-శాస్త్రిగారబ్బాయి లేడురా, వాడితో వెళ్లకు. ఏదేనా అల్లరి చేసినట్టు నాన్నకి తెలిసిందంటే వీపు విరగకొట్తాడు.' పాపం ఆవిడకి తెలియదు వాడు చేసే అల్లరిపనులన్నీ నే చెప్పినవే నని!

అందరం చెరువుపక్కన ఉన్న రావిచెట్టుక్రింద కలిశాం. చెయ్యావలసిన పనులన్నీ ఆలోచించుకున్నాం. వీధి లాంతరుముక్కలుచేసేశాం. 'డస్ట్ బిన్ని' (*Dust Bin*) కాలవలోకి త్రోశాం. అన్నట్టు చెప్పడం మరిచిపోయాను. వీటన్నిటికంటే ముందర సీతగారింటిముందర పల్లేరులు జల్లేసి, గప్-చిప్ గా, ఏమీ ఎరగని నంగనాచిలాగ వచ్చేశాం.

అన్నిటికన్న గొప్ప పని! రఘురామయ్యగారి నేమ్‌బోర్డు (*Name Board*) రంగసాని యింటి గోడకి కొట్టాం. అందువలన వీధివీధంతా గడబిడ అయిపోయింది. మంచిపని జరిగిందని చాటుగా కొంతమంది నవ్వుకున్నారు. పిల్లలు మీరిపోతున్నారని చాలామంది కేకలేశారు.

యింట్లోకి వెళ్తోంటే మా బామ్మ రహస్యంగా 'వెధవ! లోపలికి పో! పుస్తకం పుచ్చుకుని కూర్చో. నాన్న కోపంగా ఉన్నా' డంది.

నేను వెళ్లి అలమారు తీసి పుస్తకాలు తీసుకుంటున్నా. వెనకగా మా నాన్న వచ్చి రెక్క పట్టుకున్నాడు. హడిలిపోయాను.

"వెధవా! నువ్వేనా రఘురామయ్యగారి బోర్డు రంగసానింటికి తగిలించింది! అని ఉరిమాడు."

నేను తొణకలేదు.

'ఏమిటి నాన్నా? బోర్డు తగిలించడ మేమిటి!' అన్నాను ఆశ్చర్యంగా.

"వేషం వెయ్యకు. నాకు నిజం తెలిసిపోయింది. అబద్ధా లాడక ఒప్పుకో."

"నా కేం తెలియదు నాన్నా" అన్నాను బిక్క మొహంతో.

"దబాయించకు. నిజం చెప్పేయ్. లేకపోతే సున్నంలోకి ఎముక లేకుండా తంతాను. రంగసానింటికి నువ్వు ఆయనబోర్డు కొట్టలేదూ!"

"ఎవతెరా అది అసలు!" అంది బామ్మ.

"ఆయన రోజూ వెళ్లే భోగంది!"

"బాగుందిరా నాయనా! ఇది మరీ బాగుంది! ఆ భోగందానితో వాడి కేం పని! పసివెధవ! కుర్ర సన్నాసి! వాడి కెలా తెలుస్తుందిరా!" అంది చేతులు తిప్పుతూ.

"నువ్వూరుకో వమ్మా! నీ అలుసే వాడిని తగ లేస్తోంది! చదువు సంధ్య లేకుండా దున్నపోతులా తిరగడం నేర్చాడు. అన్నం చొరవేగాని అక్షరం చొరవ లేదు. అబ్బాయిగారికి!" అని రెండు దెబ్బలు వేశాడు వీపుమీద.

"ఊరుకోరా! వట్టి అహంభావం మనిషి వైపోయావ్! వట్టి పుణ్యాన గొడ్డుని బాదినట్టు వాడిని అలా కొట్టడ మెందుకు? నీ కుందిరా బుద్ధి!" అని గదమాయించింది.

"అదుగో! అలాగే అనవద్దన్నది. అన్నాడు సుక్షేత్రచేసి."

"ఆ మరీ లెస్తూ! ఆ పంతులు చెప్పడానికి వచ్చే టప్పటికి పత్తా లేకుండా ఎక్కడికో పోయేవాడివి. గడబిడ గుర్రం! కాలు జారి ఏ కాలవలో పడ్డావో అని హడిలిచచ్చేదాన్ని. పన్నెండేళ్లు వచ్చినా అల్లరి మానావా? అప్పటిమా టెందుకు? యిప్పుడు వింటున్నావా ఏమిటి! ఏమిటో వాడిని హద్దులో పెట్టాలని పెద్ద కబుర్లు చెప్తావ్! ఆ చదివే దేమిటో పూర్తయాక కాని వాడు ఆడుకోడు. పోరా పిచ్చితండ్రీ, వెళ్ళి చదువుకో, పో."

అని తల నిమిరి అవతలికి పంపింది. అమ్మయ్య అని గుండె తడుముకుని వెళ్లిపోయాను.

మా నాన్న మాట్లాడకుండా ఈజీచైరులో కూర్చున్నాడు.

యిరవై నాలుగుగంటలూ దానిదగ్గర పడిగాపులు పడితే తప్పలేదుకాని వీళ్లు బోర్డు కట్టారని పుస్సొచ్చింది ఆయనకి! అని నవ్వింది.

మా నాన్నకికూడా నవ్వొచ్చింది! రామం వచ్చి మా నాన్నని మీ బాబు ఏడండీ అని అడుగుతున్నాడు.

"ఏం కావాలో చెప్పు అన్నాడు" నాన్న. పని ఉందన్నాడు వాడు.

'నాతో చెప్పకూడని పనా అది.' అన్నాడు మా నాన్న. పంపించేస్తాడేమొ నన్న భయంకొద్దీ చేతిలో వున్న పుస్తకం క్రింద పడేసి వాడిదగ్గరకి వెళ్లాను.

ఇద్దరం తోటలోకి పోయాం.

"ఒరేయ్ మా నాన్న చితకతన్నాడురా. ఐనా నేను చెప్పలేదు" అన్నాను.

"మంచిపని చేశావ్. నన్నూ నిలవదీసి చెప్పమని మా నాన్న కేక వేశాడు. నేను చెప్పలేదు."

వాడి ధైర్యానికి మెచ్చి ఒక సపోటాకాయ కోసిచ్చాను వాడికి. ఇంతలో సూర్యం వచ్చాడు.

"పాపం వాడిని చెప్పేదాకా అన్నం పెట్టనని కొట్టిందిరా వాళ్ల పిన్ని" అన్నాడు రామం.

"ఔ్రనా. కాని నేను చెప్పలేదురా! అసలు నన్ను వెళ్లద్దంది. చెప్పకుండా అన్నం తినకుండా వచ్చేశాను. పొద్దున చద్దన్నం పెట్టలేదు వెళ్లానని! యిప్పుడు కూడా పెట్టదుట! ఎలా కొట్టిందో చూడు!" వీపు చూపించాడు సూర్యం. పాపం వేళ్లు తేలినై వీపు మీద. వాడి కళ్లంట నీరు వచ్చింది నాకు జాలేసింది. వాళ్లని వుండమని పిల్లిలాగ మా బామ్మ బుట్టదగ్గరికి వెళ్లి కర్జూరం పండు తెచ్చి వాడికిచ్చాను.

రఘు వగర్చుకుంటూ వచ్చి "ఒరేయ్! వాళ్ల నరసింహులు చెప్పేశాడురా!" అన్నాడు.

"అరి వెధవా!" అన్నా ముక్కుమీద వేలేసుకుని.

వాళ్లత్త చితకబాదింది. పాపం పేపబెత్తంతో కొట్టే రక్తం వచ్చిందిరా. యింక దెబ్బలు తినలేక

చెప్పేశాడు." అన్నాడు రఘు ఊడిపోతున్న లాగు పైకి లాక్కుంటూ.

ఇంక నా ఒంట్లో ప్రాణం లేదు. మా నాన్న నన్ను బతకనివ్వడని భయమేసింది, ఏవో నాలుగు కబుర్లు చెప్పి పంపేశాను వాళ్లని.

అనుకున్నట్టుగానే మా నాన్న ఉగ్రుడై పోయాడు. పిన్నితో నాకన్నం పెట్టద్దని చెప్పి ఆఫీసుకి వెళ్లిపోయాడు. అసలే నేనంటే ఎప్పుడూ ఆవిడ కళ్లల్లో కారం జల్లుకుంటుంది. యింక ఆవిడసంగతి యిప్పుడు వేరే చెప్పఖ్ఖర్లేదు.

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది. పుండు వెంటనే కంపు కొట్టుంది. నువ్వు పనికివచ్చే దెలాగా లేదు వెధవా! చిహ్నాలు కనిపిస్తూనే ఉన్నై.' అంటూ అష్టకం చదివేసింది. మా పిన్నికొడుకు నాలుగేళ్ల వాడు. వాడికి నేనంటే ప్రాణం. నా తెలివితేటలకి వాడు ఆర్చర్యపడేవాడు. నేను చేసే తమాషాలు, బొమ్మలు చూసి, వాడు నేనెంతో తెలివైనవాడి ననుకునేవాడు. వాడి కవన్నీ యిష్టం వలన వాడికి నామీద మంచి అభిప్రాయం ఏర్పడింది. నా కన్నం పెట్టమని తల్లితో చెప్పాడు. ఆవిడ వాణ్ణికూడా తిట్టింది. కిక్కురుమనకుండా ఊరుకున్నాడు. ఆవిడ దొడ్లోకి వెళ్లి ఏదో పని చేసికొంటోంది. నిమ్మళంగా వంటింట ఉన్న అలమారులోంచి రెండు అరిసెలు తీసి చొక్కాక్రింద దాచాడు. పరుగెత్తుకుంటూ వచ్చి నాకిచ్చాడు. ఎక్కడినించి చూసిందో మరి ఆవిడ! శక్తిలాగ విరచుకుపడిపోతూ వాణ్ణి రెక్క పట్టుకు యీడ్చింది. నీకూ వచ్చిందీ పోగాలం! అని బుగ్గసాగదీస్తూ లాక్కుపోయింది.

కాని మళ్లీ ఒక పావుగంటకల్లా చిన్న నాదగ్గిరికి వచ్చాడు. మాట్లాడకుండా అవి పడేసి వెళ్లబోతున్నాడు. నేను తీసికొనలేదు. చూడలేదనుకొని 'యింద' అన్నాడు రహస్యంగా. నాకు వద్దన్నా.

'ఆకలేస్తోంది నీకు. తీసికో అన్నయ్యా మళ్లీ అమ్మ వస్తుంది' అని గుసగుసలాడాడు.

"అమ్మ చూస్తే నిన్ను చావకొట్టుందిపో" అన్నా కోపంగా.

"ఈ రెండూ తిను. మళ్లీ అమ్మ చూడకుండా తెస్తా ఆకలివెయ్యదు."

వెళ్లిపో! అని గట్టిగా అన్నాను. వాడి కళ్లు నన్ను బతిమాలుతున్నై.

పోరా! లేకపోతే అమ్మ యిందాకలాగే గిల్లుతుంది అన్నాను విసుగ్గా.

చిట్టిమంత మొహం చేసికొని వెళ్లిపోయాడు చిన్న.

సాయంత్ర నాలుగయింది. నాకు పిన్ని పెట్టలేదు. నేను అడగలేదు. ఆకలి దంచేస్తోంది. యింక చేసేది లేక పచ్చిజామికాయలు మింగాను, కాసిని నీళ్లు తాగి పడుకున్నాను. నిద్రపోతోంటే మా బామ్మ నన్ను లేపి పిన్నిని తిట్టుకుంటూ కంచం వాల్చి అన్నం పెట్టింది. తిని మళ్లీ పడుకున్నా ఆ తోటలోనే. బామ్మ నన్ను ఎత్తుకొని తీసికెళ్లి మంచంమీద పడుకోబెట్టింది కాబోలు! పొద్దున్న చూస్తే గదిలో మంచం మీదున్నాను!

మర్నాడే మా బాబాయి వచ్చాడు. ఆయనకి నేనంటే ఎంతో అభిమానం. తల్లిలేని పిల్లాడినని జాలిపడేవాడు. మా అమ్మపోలికట నేను. తల్లిపోలికున్న మొగపిల్లవా డదృష్టవంతు డౌతాట్ట. గ్రహచారం చాలక అమ్మపోయినా నేనెంతో అదృష్టవంతుడననీ గొప్ప ఉద్యోగి నౌతాననీ పొగిడేవాడు. ఆఖరికి ఆయనమాటలే నిజమయాయి!

మా అమ్మా, బాబాయి ఒకే యీడువారట. మా బాబాయి అమ్మతో గవ్వలు, చదరంగం మొదలైన ఆటలు ఆడేవాడట. అంతా అన్యాయం ఆట ఆడేవాడట. అయినా అమ్మ కోపగించేది కాదని చెప్పాడు బాబాయి. బాబాయి కింకా పిల్లలు లేరు. అందుకని పిల్లలంటే మహా ఉబలాటపడ్తాడు.

నువ్వు మా ఊరు వస్తావురా అని అడిగాడు. ఎగిరి గంతేశాను.

"వస్తాను బాబాయ్. నన్ను తీసికెళ్లవూ. నే నేం బెంగపెట్టుకోను. పిన్ని ముట్టయితే వంట కూడా చేస్తాను." అన్నాను అందరూ నవ్వారు.

బాబాయితో వెళ్లడానికి సామానంతా సర్దుకున్నాను. పాపం చిన్న వెళ్లద్దని ఏడ్చాడు. వాడికి నా యాలా, పిస్తోలు, బొమ్మలు, చిల్లపెంకులూ అన్నీ యిచ్చేశాను. వెళ్లేటప్పుడు కొంచెం ఏడుపొచ్చిందికాని రైలెక్కగానే ఏడుపు ఎక్కడికో ఎగిరిపోయింది.

మా పిన్ని నన్ను చూసి నిర్ఘాంతపోయింది. బాబాయి నన్ను తీసికొనివస్తాడనుకోలేదు ఆవిడ. రెండు మూడు రోజులదాకా ముభావంగా ఉంది. తర్వాత రాసిఅంపానపెట్టడం మొదలెట్టింది. పల్లెటూరి గొడ్డనేది. నాజూకు తెలియదని ఏవగించుకునేది. ఏమాటంటే వెక్కిరిస్తుందో అని నేను ఆవిడతో మాట్లాడడానికే భయపడేవాణ్ణి. మాది గోదావరిజిల్లా అవడంచేత నాతో ఏదేనా చెప్తోంటే 'అయ్యా, అయ్యా' అనడం అలవాటు నాకు. 'ఏమిటబ్బీ అలా అంటావు అసహ్యంగానూ? యిక్కడ నౌకర్లుకూడా అనరు. అలా అనకు. ఎవరేనా వింటే నవ్వుతారు. నిన్ను చూస్తే సిగ్గేస్తోం' దనేది. మరి ఆవిడ అబ్బీ అనడంలేదూ! అబ్బీ అని నన్ను పిలిచినప్పుడల్లా నాకు కోపం వచ్చేది. మా చాకలిపేరు అబ్బి. చాకలి అబ్బినా నేను? కాని ఆవిడని అలా పిలవవద్దని చెప్పడానికి ధైర్యం చాలేదికాదు.

ఒకరోజున ఆవిడ నా క్రాపులో ఉన్న పిలక చూసింది. మా నాన్న క్రాపు చేయించినా, పేరుకి మాత్రంగా బుల్లిపిలక ఉంచాడు. నేను పిలక ముడెట్టుకోడం చూసి 'ఛీ అది తీయించుకోరాదూ!' అంది. నాకు సిగ్గేసింది. ఆవిడ అలాగ అడిగినందుకు కోపం కూడా వచ్చింది.

బామ్మకి కోపం వస్తుంది అన్నాను. తర్వాత క్షౌరం చేయించుకునేటప్పుడు మంగలి పిలక తీసేశాడు. వాడు తీస్తున్నట్టు నాకు తెలియదు. తీరా చూసేసరికి పిలక లేదు. నేను చెప్పకుండా నా పిలక కత్తిరించడానికి వీ డెవడు? అరికాలిమంట నెత్తికొచ్చింది నాకు. ఎందుకు కత్తిరించావ్ నా పిలక? అని కోపంగా అడిగాను. మీ అమ్మగారు కత్తిరించమన్నారండీ, అని నవ్వాడు వాడు. యింకేం చెయ్యను నేను! మా బాబాయితో పిన్ని లేనప్పుడు చెప్పాను. పోనీలేరా అని పకపక నవ్వాడు.

నేను అష్టపదులు చాలా బాగా పాడగలను. బామ్మ నేర్పింది నాకు. ఒకరోజున 'రాధికాకృష్ణ' పాడుతూంటె మా పిన్ని పాడమంది. పాడాను. పాడినంతసేపు బాగా లేదంటుందేమో నని అనుకున్నాను. యింత బాగా పాడుతా వనుకోలేదు సుమా అబ్బీ అంది. ఛీ, ఈలాగ అబ్బీ అనకుండా ఉంటే ఎంత బాగుండును. నేను మొహం కొంచెం చిట్లించుకున్నాను. తర్వాత ధైర్యం చేసి "నన్ను బాబు అనక అబ్బీ అంటా వేమిటి?" అన్నాను.

"అబ్బీ అంటే ఏం. అదేం తిట్టుకాదులే" అని నవ్వింది. యింకా ఏదైనా అంటే కేక లేస్తుందేమో నని ఊరుకున్నాను. మర్నాటినించీ నేను అష్టపదులు పాడుకునేవాడిని. ఆవిడకి నా పాటలు నచ్చలేదు కాబోలు.

"ఏవైనా హిందీపాటలు పాడు. లేకపోతే అసలు పాడకు. పక్కభాగంలో ఉన్నామె నిన్న నీపాట విని నవ్వింది" అంది.

అష్టపదులు పాడడం మానేశాను. యీల వేస్తే గొడ్లకాపరిలాగ యీలేమి టనేది. అక్కడమా పిన్ని అనుకుంటే, యిక్కడ ఈవిడ ఆమెకన్నా మించిపోయింది నన్ను సతాయించటంలో. నాకు యింక యిక్కడ ఉండా లనిపించలేదు. ఇంటికి వెళ్తే బాగుండు ననుకున్నా. ముఖ్యంగా చిన్నని చూడా లనిపించింది. వారంరోజులలోనే మొహం మొత్తింది. అక్కడ ఉండదల్చుకోలే దింక.

ఇంతలో మా పిన్నికి జ్వరం వచ్చింది. బాబాయి ఉత్తరం వ్రాస్తే బామ్మ వచ్చింది. బామ్మని చూడగానే ప్రాణం లేచివచ్చింది నాకు. ఇక్కడ ఉండనని చెప్పా నావిడతో. నాకు కష్టం తోచిన విషయాలన్నీ పూసగ్రుచ్చినట్టు చెప్పాను. తల్లి లేని బిడ్డా, ఉద్యోగం లేని మొగవాడూ అందరికీ లోకువే నాయనా అంది బామ్మ. మా బామ్మ నాకేం లోటు జరిగినా తల్లి లేదుకనక జరిగిం దనేది.

మా బామ్మతో మా ఊరు వచ్చేశాను. చిన్న నన్ను చూడగానే తినే అన్నం వదిలేసి పరుగెత్తుకుని వచ్చాడు. మళ్లా అల్లరి మొదలెట్టాను.

బామ్మకి ఉబ్బసందగ్గు. అందుకని ఉమ్మెత్త గొట్టంతో పొగ పీలుస్తుంది. ఆవిడ పొగపీల్చుకుంటూంటే ముక్కులోంచి తెప్పించమని ఆవిడని వేధిస్తున్నా. ఇంతలో మా నాన్న వచ్చాడు. నన్ను తిట్తాడనుకున్నాను. కాని నవ్వుతూ "ఏరా అల్లరి చేస్తున్నావు. మళ్లీ బాబాయిదగ్గరికి పంపెయ్యనా" అన్నాడు.

"ఇంకెప్పుడూ చెయ్యనులే నాన్నా" అన్నాను. అలాగే అలాటి అల్లరి ఎప్పుడూ చెయ్యలేదు.